క్లుప్తంగా

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణారెడ్డి

కందుకూరు: ఆంధ్రప్రదేశ్‌ని సంపూర్ణ రోగ రహిత రాష్ట్రంగా నిలపాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని మున్సిపల్ కమిషనర్ కేవీ.కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక 3వ సచివాలయ పరిధిలో నల్లమల్లివారితోటలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సకాలంలో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. జేసీఎస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, మున్సిపల్ మేనేజర్ చంద్రమోహన్, డీఈ రమేష్, ఏఈ లోకేష్, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతినిధి పాశం కొండయ్య, సచివాలయం కన్వీనర్ చీమకుర్తి కృష్ణారెడ్డి, కందుకూరి శ్రీనివాసదీక్షితులు, క్రిస్టియన్ విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ గోపనబోయిన నర్సయ్య, ఏఏడీ మాజీ అధ్యక్షుడు గేరా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్



వావిలేటిపాడులో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ చేస్తున్న వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి

జరుగుమల్లి: మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న కాలనీల్లో కేటాయించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు సంయుక్తంగా లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో లబ్ధిదారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని వావిలేటిపాడు సచివాలయ పరిధిలో 101 రిజిస్ట్రేషన్లకుగాను 81 పూర్తి చేసినట్లు వీఆర్‌ఓ రాకేష్‌బాబు, సచివాలయ కార్యదర్శి జె.బ్రహ్మయ్య, డీఏ సంధ్యారాణి తెలిపారు.

రమాభాయ్‌కి నివాళి

ఉలవపాడు: మాతా రమాభాయ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఉలవపాడులో నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ కోసం ఆమె ఎన్నో త్యాగాలు చేశారని ఆమె జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అంబేడ్కర్ అసోసియేషన్ నాయకులు ఆదిత్య, రాహుల్, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం



కషాయాలు తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది

కందుకూరు రూరల్: టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ సహకారంతో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డి.మాలకొండయ్య మాట్లాడుతూ ప్రకృతి ఆహారం వినియోగం వల్ల ఉపయోగాల గురించి, ప్రకృతి ఆహారం పండించడంలో ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా, సస్యరక్షణ చర్యలు ఏ విధంగా చేపట్టాలి అనే విషయాలను కూలంకుషంగా వివరించారు. విద్యార్థులకు ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది జీవామృతం, పచ్చి మిర్చి వెల్లుల్లి ద్రావణం, నీమాస్త్రం తయారీ విధానం, వాటి వల్ల కూరగాయ పంటలకు ఏ విధంగా ఉపయోగపడతాయో తెలియజేశారు. కళాశాలలో ప్రాంగణంలో ఉన్న ఫ్రూట్ ట్రీ గార్డెన్, మెడిసినల్ గార్డెన్ సందర్శించి వాటికి కావాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది సునీత, ధనమ్మ, వంశీ, మాధవ్, రాజా, డిపార్మెంట్ ఇన్‌చార్జి తిరుపతిస్వామి, ఎం.బాల నాయక్‌లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

తహసీల్దార్‌గా రవిబాబు బాధ్యతల స్వీకరణ

ఉలవపాడు: తహసీల్దార్‌గా రవిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా నుంచి ఆయన బదిలీపై ఉలవపాడుకు వచ్చారు. మండల పరిధిలోని రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. డీటీ వీరయ్య, సూపరిండెంటెడ్ రాము, సర్వేయర్ శ్రీనివాసులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

సింగరాయకొండ(టంగుటూరు): సింగరాయకొండ మండల తహసీల్దార్‌గా జె.ప్రసాదరావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమాను మండలం నుంచి బదిలీపై వచ్చారు. సోమవారం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శంకాల రామయ్య కంభం బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌ను డీటీ కె.సుజాత, ఆర్‌ఐ ప్రవీణ్‌కుమార్, వీఆర్‌ఓలు వెంకటాద్రి, బలరామిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆర్థికశక్తిగా ఎదగాలి

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జనరంజక పాలన
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దద్దాల నారాయణయాదవ్
- 955 గ్రూపులకు రూ.7.12 కోట్ల చెక్కుల పంపిణీ



పొదుపు మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త డాక్టర్ దద్దాల, పీడీసీసీబి చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

పామూరు: ప్రతి మహిళ ఆర్థికశక్తిగా ఎదగాలని ఆ లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏపీఎం రజనీకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త డాక్టర్ నారాయణయాదవ్ మాట్లాడుతూ నాడు ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీమేరకు పొదుపు గ్రూపులకు రుణమాఫీ చేశామన్నారు. ఇందులో భాగంగా చివరి విడతగా 955 గ్రూపులకు రు.7.12 కోట్ల మేర నాలుగు విడతల్లో మొత్తం రూ.28.50 కోట్ల ఆసరా చెక్కులను అక్కచెల్లెమ్మలకు అందజేశామన్నారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాల రూపంలో అక్కచెల్లెమ్మలకు వివిధ పథకాల లబ్ధి కింద మొత్తం రూ.2.54 లక్షల కోట్లు ఖాతాల్లో జమ చేసి ఆర్థిక భరోసా కల్పించారని కొనియాడారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు పక్కా ఇళ్ల ఏర్పాటులో భాగంగా నియోజకవర్గంలో 25 వేల మందికి పైగా మహిళలకు నివేశనా స్థల పట్టాల పంపిణీ చేయడంతో పాటు వారికి కాలనీలు మంజూరు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌ను ఆశీర్వదించాలన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జనరంజక పాలన

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. విద్యతోనే సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమని, చదువులకు పేదరికం అడ్డుకాకూడదనే భావనతో పేదల చదువులకు బాసటగా నిలిచేందుకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీవిద్యాదీవెన, జగనన్న విద్యాకానుక పథకాలను అమలు చేసి పేదల పక్షపాతిగా నిలిచాడన్నారు. ఈ సందర్భంగా పొదుపు గ్రూపుల సభ్యులకు చెక్కును అందజేశారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీడీసీసీబి చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్. చాంద్‌బాషా, కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, నరాల రమణారెడ్డి, వైస్ ఎంపీపీ ఏసురత్నం, కోఆప్షన్ నాయబ్‌రసూల్, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, అంబటి కొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, కందుల శ్రీను, ఏసీ కత్తి కల్యాణ్, ఏపీఎం రజనీకుమారి, బీబీజాన్, చల్లా సుబ్బారావు, షేక్.అబ్దుల్, యాటా రాఘవేంద్ర, షేక్.నాయబ్‌రసూల్, చెనికల శ్రీను, పోలినేని శ్రీను, గోవిందయ్య, శ్రీరాం శ్రీను, కే.చిన్నయ్య, వెలిగండ్ల జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, కనిగిరి మడతల కస్తూరిరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, పిల్లి లక్ష్మినారాయణరెడ్డి, మూలె గోపాల్‌రెడ్డి, కే.వెంకటరత్నం, ఎంపీటీసీ, సర్పంచ్, సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



పామూరులో ఆసరాలో పాల్గొన్న పొదుపు మహిళలు

మహిళలు స్వశక్తితో ముందుకు సాగేందుకే ఆసరా



సీఎస్‌పురంలో ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త డాక్టర్ దద్దాల

సీఎస్‌పురం(పామూరు): మహిళలు స్వశక్తితో ముందుకుసాగి ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం ఆసరా అందజేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కుల పంపిణీ ఏసీ కత్తి కల్యాణ్, ఏపీఎం గంటా విద్యాసాగర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 642 గ్రూపులకు సంబంధించి రూ.5.63 కోట్ల చెక్కులను పొదుపు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దద్దాల మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి పురుషులతో సమానంగా ఎదగాలన్నది సీఎం ఆకాంక్ష అన్నారు. సంక్షేమ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకే ఇచ్చి సీఎం జగన్ మహిళాపక్షపాతిగా నిలిచారన్నారు. పాదయాత్ర, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలుచేసి పేదల సంక్షేమానికి అండగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు.

వెలుగొండ ప్రాజెక్ట్ త్వరలో జాతికి అంకితం

పశ్చిమ ప్రాంత వరప్రసాదిని వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్ పనులు పూర్తయ్యాయని, ఈ నెలాఖరులోపే ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేస్తారన్నారు. తద్వారా సాగు, తాగునీటి కష్టాలు శాశ్వతంగా తొలగిపోతాయన్నారు. త్వరలో సీఎం జగన్ రామాయపట్నం పోర్టును కూడా ప్రారంభిస్తారని తెలిపారు. ఈసందర్భంగా సీఎం చిత్రపటానికి దద్దాల, నాయకులు, పొదుపు మహిళలు పాలాభిషేకం చేశారు. అనంతరం డాక్టర్ దద్దాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు బొర్రాజు రమణయ్య, కోఆప్షన్ పఠాన్ మహబు, ఏఎంసీ డైరెక్టర్ కత్తులపల్లి రమణారెడ్డి, ఎస్.ప్రకాష్‌రెడ్డి, భైరవకోన ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముదుమాల నారాయణరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, ఇండ్లా బాలయ్య, అటే లయ్య, సోడా రవిచంద్రారెడ్డి, పాలుగుళ్ల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ కనుమరుగు

- సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌కు మరోసారి పట్టంకట్టాలి
- నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ

సీఎస్‌పురం(పామూరు): అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక ఆర్‌ఎంఎస్ కల్యాణమండపంలో బుధవారం జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులుయాదవ్, వైఎస్‌ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత సమన్వయకర్త డాక్టర్ దద్దాల పరిచయ కార్యక్రమం, పార్టీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ దద్దాల మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించి ధర్మపాలన అందించిన ఏకైక సీయం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా కరోనా సమయంలోకూడా పథకాలను పేదల దరిచేర్చి ఆదుకున్నారన్నారు. వచ్చే ఎన్నికలతో టీడీపీ కనుమరగవుతుందన్నారు. ఈ సందర్భంగా దద్దాలను, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలను ఘనంగా గజమాలతో సన్మానించారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

మద్యంపై చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటు

పీడీసీసీబి చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం ధరలు పెంచి మద్యాన్ని ప్రజలకు దూరంచేసి మద్య నిషేధం దిశగా సీఎం జగన్ అడుగులు వేస్తుంటే చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే మద్యం రేట్లు తగ్గించి మందు బాబులకు న్యాయం చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబులాంటి వారిని గద్దెనెక్కిస్తే భవిష్యత్ అంధకారమేనన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీలు మేకల శ్రీనివాసులు, గుంటక తిరుపతిరెడ్డి, మడతల కస్తూరిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటయ్య, ఓకేరెడ్డి, పీసీపల్లి ఎంపీపీ అత్యాల జఫన్య, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, బొర్రాజు రమణయ్య, కోఆప్షన్ మహబు, కత్తులపల్లి రమణారెడ్డి, ఎస్.ప్రకాష్‌రెడ్డి, భైరవకోన ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముదుమాల నారాయణరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎస్‌పురంలో వైఎస్సార్‌సీపీ నాయకుల ర్యాలీ

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: మండలంలో జరగనున్న ఉపాధిహామీ పనులపై స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలోటెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీఓ అబ్దుల్లా బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో త్వరలో ఉపాధి పనులు ప్రారంభించనందున, పనులకు వచ్చే కూలీలను సన్నద్ధం చేయాలన్నారు. పనుల నిర్వహణపై ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్లను సమన్వయం చేసుకోవాలన్నారు. పొలాల్లో ఫారంపాండ్స్ తీసుకునే రైతుల వివరాలను తీసుకోవాలన్నారు. ఉద్యానవన పంటలను ఎక్కువగా సాగు చేసుకునేలా రైతులకు ఆ పంటల ప్రయోజనాలు, రాయితీలు గురించి అవగాహన కల్పించాలన్నారు.

9న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

వలేటివారిపాలెం: మండలంలోని కలవళ్ల గ్రామ సచివాలయంలో ఈ నెల 9న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్ తెలిపారు. 9వ తేది ఉదయం 9.30 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, కో ఆప్షన్ మెంబర్లు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

10 నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు

సింగరాయకొండ(టంగుటూరు): పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి ప్రారంభమయ్యే ధర్మప్రచార వారోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, ఈఓ కృష్ణవేణి బుధవారం రాత్రి తాడేపల్లిలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు రోజుకు ఓ గ్రామంలో శోభాయాత్ర, స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ముందుగా మంత్రి సురేష్‌ను ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహాచార్యులు సత్కరించి ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉదయగిరి లక్ష్మీ నరసించార్యులు పాల్గొన్నారు.



మంత్రి సురేష్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పామర్తి మాధవరావు

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

కనిగిరి రూరల్: పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్షా పథకమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఆరో సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షా పథకం రెండో విడత నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దాసరి పద్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్షా పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. కమిషనర్ కె.డానియల్ జోసఫ్ మాట్లాడుతూ ప్రజల ముంగిటకే నాణ్యమైన, ఉచిత వైద్యాన్ని ప్రభుత్వం అందచేస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందచేశారు. దాసరి మురళీ, వైద్యాధికారి ప్రియార్షానంద, అధికారులు రోహిణి రెడ్డి, నాగరాజు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు, సచివాలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్‌గఫార్

ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి

టంగుటూరు: ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని డ్వామా ఒంగోలు క్లస్టర్ ఏపీడీ వెంకటస్వామి పేర్కొన్నారు. స్థానిక ఏపీఓ కార్యాలయంలో టంగుటూరు, జరుగుమల్లి, కొండపి మండలాల ఉపాధి హామీ సిబ్బందికి బుధవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ వెంకటస్వామి మాట్లాడుతూ.. టంగుటూరు మండలంలో 1000, జరుగుమల్లి మండలంలో 1000, కొండపి మండలంలో 1500 మంది కూలీలకు అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలని సూచించారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున పనులు శాంక్షన్ చేయించుకుని రెడీగా పెట్టుకోవాలన్నారు. అదే విధంగా హౌసింగ్ 90 రోజులకు సంబంధించి పేమెంట్ చేయాలన్నారు. ఏ గ్రామంలోనైనా పని చేపట్టకపోతే ఫీల్డ్ అసిస్టెంట్, సంబంధిత సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. టంగుటూరు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టంగుటూరు, కొండపి, జరుగుమల్లి మండలాల ఏపీఓలు సుభాషిణి, మహాలక్ష్మి, నాగరాజు, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



టంగుటూరులో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

మహాశివరాత్రికి ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, ఆలయ కమిటీ చైర్మన్ మల్లికార్జున


కనిగిరి రూరల్: మహా శివరాత్రి పండుగకు ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఆలయ కమిటీ చైర్మన్ గొంట్లా మల్లికార్జున అన్నారు. కనిగిరి కొండపైన కొలువై ఉన్న విజయమార్తండేశ్వర స్వామి గుడికి వెళ్లే దారి ప్రదేశాన్ని, ఆలయ ప్రాంగణాన్ని బుధవారం చైర్మన్ అబ్దుల్ గఫార్, మున్సిపల్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మహా శివరాత్రి నాడు భక్తుల రాకపోకలకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. తక్షణ చర్యలుగా పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఏఈ కోటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫుద్దీన్, సచివాలయ అధికారులు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పసుపులేటి అరుణోదర్, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

9న నులి పురుగుల నిర్మూలన మాత్రల పంపిణీ

గుడ్లూరు: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వైద్యాధికారి మారుతీరావు అధ్యక్షతన బుధవారం మండల లెవల్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ సుబ్బారావు, ఎంఈఓ-2 గోవర్ధన్‌లు మాట్లాడుతూ 6-19 ఏళ్ల లోపు బాల బాలికలకు కడుపులో నులిపురుగులు ఉంటే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. నులిపురుగుల నివారణకు ఉచితంగా ప్రభుత్వం ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేస్తుందన్నారు. వైద్యాధికారి మారుతీరావు మాట్లాడుతూ ఈమాత్రలు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లేని సురక్షితమైనవన్నారు. అనంతరం నులిపురుగుల నిర్మూలన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సీహెచ్‌ఓ భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కష్టంతో కాదు ఇష్టపడి చదవాలి

పొన్నలూరు: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ ఎస్‌కే రషీద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవం, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ, విలువలు ముఖ్యమని వీటిని పాటించిన వారు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. త్వరలో పబ్లిక్ పరీక్షలు ఉన్నందున ప్రణాళికబద్ధంగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించి కళాశాలకు పేరు తేవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రవికిరణ్, ముక్కమూరి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు విఠల్, జాన్‌బాబు, వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రషీద్

ఇళ్ల రిజిస్ట్రేషన్‌లో వేగం పెంచాలి



తహసీల్దార్, ఎంపీడీఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ

సీఎస్‌పురం(పామూరు): సచివాలయ సిబ్బంది ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆయన తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరాతో ఇళ్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమ తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలను తనిఖీ చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తిచేయాని ఆదేశించారు. మండలంలోని 43 పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు అనుకూలంగా ర్యాంపుల నిర్మాణం, నీటి వసతి, విద్యుత్, భద్రత మొదలైన విషయాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తిచేయించాలని తహసీల్దార్‌కు నాగూర్ మీరాకు సూచించారు. నవరత్న పథకాల అమలుపై ఎంపీడీవో జి.క్రిష్ణయ్యతో చర్చించారు. ఈనెల 12వ తేదీలోగా కులగణన ప్రక్రియను పూర్తిఅయ్యేలా చూడాలని తహసీల్దార్, ఎంపీడీఓలకు సూచించారు.

నాణ్యమైన దిగుబడితో గిట్టుబాటు ధర

జరుగుమల్లి: నాణ్యమైన పొగాకు దిగుబడి సాధించినప్పుడే రైతులకు గిట్టుబాటు ధర దక్కి లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుందని టుబాకో బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు పేర్కొన్నారు. జరుగుమల్లి మండలంలోని కామేపల్లి, సతుకుపాడు, నర్సింగోలు, రామచంద్రాపురం, అక్కచెఱువుపాలెం, కొండపి మండలంలోని కట్టావారిపాలెం, నేతివారిపాలెం గ్రామాల్లో పొగాకు రైతులకు అవగాహన కల్పించారు. పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్, సీనియర్ గ్రేడింగ్ అధికారి టి.సాయికుమార్, అలియన్స్ ప్రతినిధి ఎన్.వెంకటేశ్వర్లు, క్షేత్ర మిత్ర బృందం, పొగాకు బోర్డు క్షేత్ర సిబ్బంది పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

కందుకూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 9.30 నుంచి 4గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.మస్తానయ్య, ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆఫీసర్ సి.విజయ నిఖిల్‌కుమార్ తెలిపారు. జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఫార్మసీ, డిప్లొమో, ఐటీఐ అర్హత కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9550595228, 7989668732 నంబర్లను సంప్రదించాలని కోరారు.

18 బాటిళ్ల మద్యం స్వాధీనం

టంగుటూరు: మండలంలోని కాకుటూరివారిపాలెం గ్రామానికి చెందిన కె.జోగిబాబు అక్రమంగా మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. నిందితుడి నుంచి 18 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలి

లింగసముద్రం: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని సెక్టార్ సూపర్‌వైజర్ రాధాదేవి అన్నారు. మండలంలోని రాళ్లపాడు అంగన్‌వాడీ సెంటర్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లోని స్టాకు రికార్డులను, పిల్లల హాజరుపట్టీని పరిశీలించారు. సెంటర్‌కు పిల్లలు ఎంతమంది వచ్చారు, హాజరు ఎంతమందికి వేశారని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలోని బాలింతలకు, గర్భిణులు, చిన్నపిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న బాలామృతం, రాగిపిండి, పాలు, గుడ్లు, ఇతర సరుకులను సక్రమంగా అందజేయాలన్నారు. పిల్లలకు వండిపెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు